క్లుప్తంగా

ఉత్తమ సేవలతోనే ప్రజల నుంచి గుర్తింపు



పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్‌ను సన్మానిస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

పాములపాడు: పదవీలో ఉన్నంత కాలం నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయడంతోనే మంచి గుర్తింపు ఉంటుందని ఎంపీడీఓ సరస్వతి అన్నారు. పాములపాడు పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ ఆదివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. కార్యాలయ సిబ్బంది, తోటి ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, బంధు మిత్రులు దుశ్శాలువా, పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కరుణసాగర్, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు నాయుడు, సర్పంచులు భాగ్యమ్మ, వరప్రసాద్, మౌలాలి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

చెట్లతోనే పర్యావరణ పరిరక్షణ

నందికొట్కూరు రూరల్ : చెట్ల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని బీజేపీ నాయకులు వీరం మురళీధర రెడ్డి అన్నారు. ఆదివారం దేశ ప్రధాని మోదీ మన్‌కీ బాత్ 111వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని వారు వీక్షించారు. వారు మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూచనల మేరకు దేశంలో ప్రతి పౌరుడు అమ్మ పేరుతో ఒక మొక్కను నాటాలని సూచించారు. చెట్లు నాటడం ప్రతి పౌరుడు బాధ్యతగా చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆశోక్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ పథకాలను కొనసాగించాలి

ఆత్మకూరు: దళితులకు, గిరిజనులకు ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలను కొనసాగించాలని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పాతకోట భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.సంపత్ డిమాండ్ చేశారు. ఆదివారం వారు స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఆ కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలన్నారు. ఆ నిధుల ద్వారా ఎస్సీ, ఎస్టీలకు సంక్షేమ పథకాలను అందించాలన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నక్క స్వాములు, నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వద్దు

కొత్తపల్లి: సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎవరు నిర్లక్ష్యం వహించకూడదని ఎంపీడీఓ జవహర్ బాబు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో 12 గ్రామ పంచాయతీలకు గాను 154 క్లస్టర్లు ఉన్నాయని అందులో 4,344 మంది వివిధ రకాల పింఛన్ లబ్ధిదారులు ఉన్నారని వివరించారు. వీరికి ఒక్కరోజులో పింఛన్ పంపిణీ చేసేందుకు 109 మంది సచివాలయ సిబ్బందిని నియమించామని చెప్పారు. మండలంలోని మొత్తం పింఛన్ దారులకు రూ.2.85కోట్లు సచివాలయాల సిబ్బందికి అందించడం జరిగిందని వివరించారు. పింఛన్ పంపిణీ కార్యక్రమానికి ఏ అధికారికి మినహాయింపు లేదన్నారు.

విగ్రహాలను ఆవిష్కరించాలి



ముళ్లపొదల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని చూపిస్తున్న సీపీఐ నాయకుడు రమేష్

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల గ్రామంలోని అంబేడ్కర్, పొట్టిశ్రీరాములు విగ్రహాలను ముళ్లపొదల్లో ఉంచటం భావ్యం కాదని సీపీఐ పార్టీ నాయకుడు రమేష్‌బాబు అన్నారు. ఆదివారం ఆయన పారుమంచాల గ్రామంలో ముళ్లపొదల్లో ఉన్న అంబేడ్కర్, అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దేశప్రజలు గర్వించదగిన మహాత్ముల విగ్రహాలను సంవత్సరాల తరబడి ఆవిష్కరించకుండా ముళ్లపొదల్లో ఉంచటం సమంజసం కాదన్నారు. విగ్రహాలను ముళ్లపొదల్లోంచి తొలగించి గ్రామంలో ఆవిష్కరించాలన్నారు. లేని ఎడల సీపీఐ తరుపున తామే గ్రామంలో విగ్రహాలను ఆవిష్కరిస్తాని తెలిపారు.

మంచి పనులే కలకాలం గుర్తుంటాయి

మహానంది: విధి నిర్వహణలో చేసిన మంచి పనులే ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి అన్నారు. మహానంది మండలం విద్యాశాఖాధికారి–2గా పనిచేసిన లింగన్న ఆదివారం పదవీ విరమణ పొందారు. మహానందిలోని శాలివాహన అన్నసత్రం భవనంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ రామసుబ్బయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బండిఆత్మకూరు ఎంఈఓ యశోధ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మణ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షం.. సాధారణంకంటే అధికం

- ఆత్మకూరు డివిజన్‌లో విస్తారంగా వర్షాలు
- ముందస్తు సాగు చేపట్టిన రైతన్నలు
- జూన్ నెలలో సాధారణం కంటే 52.33 మి.మీ అధిక వర్షపాతం



ఆత్మకూరులో ఇటీవల కురిసిన వర్షానికి రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు (ఫైల్)

ఆత్మకూరు: ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం కంటే ముందుగానే వరుణుడు కరుణించడంతో రికార్డుస్థాయిలో వర్షాలు నమోదవుతున్నాయి. ఆత్మకూరు డివిజన్‌లో గతేడాది కంటే ఈ ఏడాది అత్యధికంగా వర్షాలు నమోదయ్యాయి. వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. చెరువులు జలకళ సంతరించుకున్నాయి. వర్షాలు ఆశాజనకంగా కురవడంతో రైతులు ముందస్తు సాగు చేపట్టారు.

జూన్ నెలలో అత్యధికం..

డివిజన్ పరిధిలో ఆత్మకూరు, వెలుగోడు, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. డివిజన్ పరిధిలో ఏప్రిల్ నెలలో 17.9 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 18.8 మి.మీ. వర్షం కురిసింది. మే నెలలో సాధారణంగా 32 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 94 మి.మీ. వర్షం కురిసింది. సాధారణ వర్షపాతం కంటే అత్యధిక వర్షం మే నెలలో కురవడంతో రైతులు ముందస్తు సాగు చేపట్టారు. జూన్ నెలలో 87.5 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 133.3 మి.మీ. వర్షం కురిసింది. కేవలం ఐదు రోజుల్లోనే అధిక వర్షాలు కురవడంతో అన్నదాతలు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ఈనెలలో 52.3 మి.మీ. అధికంగా వర్షపాతం నమోదయ్యింది.

4వేల హెక్టార్లకు పైగా సాగు..

డివిజన్ పరిధిలో వరి, జొన్న, పత్తి, కంది, పెసర, ఎండుమిర్చి పంటలను రైతులు సాగుచేస్తున్నారు. అలాగే డివిజన్‌లో ఇప్పటివరకు 4 వేల హెక్టార్లకు పైగా వివిధ పంటలను రైతులు సాగుచేయగా, జూలై 15వ తేదీ వరకు ఖరీఫ్ సీజన్ ఉండడం వల్ల ఇలా వరుణుడు అనుకూలిస్తే పూర్తిస్థాయిలో రైతులు పంటలను సాగుచేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

మండలాల వారీగా వర్షపాతం వివరాలు..

➡ ఆత్మకూరు మండలంలో ఏప్రిల్ నెలలో 16.6 మి.మీ. గానూ 6.2 మి.మీ., మే నెలలో 29 మి.మీ. గానూ రికార్డుస్థాయిలో 139.6 మి.మీ., జూన్ నెలలో 92 మి.మీ. వర్షపాతానికి గానూ 231 మి.మీ. వర్షపాతం నమోదయ్యింది. దాదాపు 98 శాతం అత్యధిక వర్షపాతం ఈనెలలో నమోదు కావడం జరిగింది.

➡ వెలుగోడు మండలాన్ని పరిశీలిస్తే ఏప్రిల్ నెలలో సాధారణంగా 21.4 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఎలాంటి వర్షం పడలేదు. మే నెలలో 32 మి.మీ. సాధారణ వర్షపాతానికి గానూ 87 మి.మీ. వర్షపాతం నమోదయ్యింది. అంటే రెట్టింపు వర్షపాతం నమోదయ్యింది. ఈ మండలంలో జూన్ నెలలో సాధారణ వర్షపాతం 91 మి.మీ. కాగా ఇప్పటికే 99 శాతానికి పైగా వర్షాలు కురిశాయి.

➡ పాములపాడు మండలంలో ఏప్రిల్ నెలలో 14 మి.మీ.లకు గానూ 7.2 మి.మీ., మే నెలలో 38.9 మి.మీ.లకు గాను 101.9 మి.మీ., జూన్ నెలలో సాధారణ వర్షపాతం 77.9 మి.మీ.కు గానూ ఇప్పటికే 124.8 మి.మీ. వర్షం నమోదయ్యింది.

➡ కొత్తపల్లి మండలంలో ఏప్రిల్‌లో సాధారణంగా 29 మి.మీ.కు ఎలాంటి వర్షం కురవలేదు. మే నెలలో సాధారణ వర్సపాతం 29 మి.మీ.కు గానూ 48.6 మి.మీ. వర్షపాతం నమోదై దాదాపు సగానికి పైగా అత్యధిక వర్షపాతం నమోదయ్యింది. జూన్ నెలలో 84.9 మి.మీ.కు గానూ ఇప్పటివరకు 135.8 మి.మీ. రికార్డుస్థాయిలో వర్షం కురిసింది. ఇలా డివిజన్‌లోని నాలుగు మండలాల్లో అత్యధికంగా వర్షాలు కురవడంతో రైతన్నలు విస్తారంగా పంటలను సాగుచేశారు.

రెండు రోజుల్లో పింఛన్ల పంపిణీ పూర్తి చేస్తాం

పాములపాడు: ఈ నెల1, 2 తేదీల్లోనే పింఛన్ సొమ్ము పంపిణీ పూర్తి చేస్తామని ఎంపీడీఓ సరస్వతి అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 5,889 మంది పింఛన్ దారులున్నారన్నారు. వీరికి రూ.3,91,29,000 నగదు మంజూరయ్యిందని చెప్పారు. 207 క్లస్టర్లకు గాను 123 మంది సచివాలయ ఉద్యోగులను పింఛన్ పంపిణీకి కేటాయించామన్నారు. పాములపాడు, యర్రగూడూరు, మిట్టకందాల గ్రామాల్లో పర్యవేక్షణకు ఎంపీడీఓ సరస్వతి, జూటూరు, తుమ్మలూరు, రుద్రవరం గ్రామాలకు ఈఓపీఆర్డీ శ్రీనివాసులునాయుడు, ఏపీఓ విమలమ్మ..ఇస్కాల, లింగాల, చెలిమిల్ల, ఏఈ పీఆర్ రాఘవేంద్ర ప్రసాద్.. బానుముక్కల, బానకచెర్ల, వేంపెంట, ఏఈ ఆర్‌డబ్ల్యుఎస్ అనిల్.. మద్దూరు, వానాల గ్రామాలకు ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు తెలిపారు. ఉదయం 6గంటల నుంచి పంపిణీ ప్రారంభిస్తామన్నారు.

రేషన్ కార్డుదారులకు జొన్నల పంపిణీ

ఆత్మకూరు: జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు జూలై నెలలో రేషన్ కార్డుదారులకు బియ్యంతో పాటు జొన్నలను ఉచితంగా అందిస్తున్నట్లు తహసీల్దార్ బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జూలై 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఎండీయూ వాహనం ద్వారా కార్డుదారులకు 3 కేజీల వరకు జొన్నలను అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి



విద్యార్థుల గురించి వార్డెన్‌ను ఆరా తీస్తున్న జిల్లా సాధికార అధికారి కె.లక్ష్మీదేవి

కొత్తపల్లి: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని జిల్లా వెనుకబడిన తరగతుల, సాధికారత అధికారి కె.లక్ష్మీదేవి సూచించారు. ఆదివారం స్థాని బీసీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థుల సంఖ్య, హాజరు, మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా లేదా అని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. అదేవిధంగా ప్రభుత్వం నుంచి వచ్చిన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఇచ్చారా లేదా అని ఆరా తీశారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ విద్యాసంవత్సరానికి 10 వతరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రేరణ కలిగించాలని చెప్పారు. ఆమెతో పాటు వసతిగృహ వార్డెన్ షబ్బీర్ ఉన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

మహానంది: మహానంది మండలంలోని 13 గ్రామ పంచాయతీలు, ఎనిమిది మజరా గ్రామాల్లో మొత్తం 5,260 పింఛన్లు ఉన్నాయని, జులై 1న పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రూ.3.56కోట్లు పంపిణీ చేయనున్నామన్నారు. ప్రతి గ్రామంలో ఉదయం నుంచే పింఛన్ల పంపిణీ చేపట్టాలని సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. బండిఆత్మకూరు మండలంలో 6656 మంది లబ్ధిదారులు ఉన్నారని, రూ. 4.50కోట్లు నగదును పంపిణీ చేయనున్నామని బండిఆత్మకూరు ఎంపీడీఓ విజయరావు తెలిపారు. పంపిణీ కోసం 137 మందిని డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్లుగా నియమించామన్నారు.

ఘనంగా మేకలదాదా ఉరుసు



మేకలదాదా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

పగిడ్యాల: మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో ఆదివారం మేకలదాదా ఉరుసు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా జూన్ చివరి వారంలో మేకలదాదా ఉరుసు జరుపుకోవడం ఆనవాయితీ. ఈ వేడుకలను తిలకించేందుకు సమీప గ్రామాలైన ప్రాతకోట, మండ్లెం, భాస్కరాపురం, రైతుపల్లె, ఎం.ఎస్. ఘణపురం, పగిడ్యాల, సంకిరేణిపల్లె తదితర గ్రామాల్లోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగే వేడుకలను ఉత్సవ కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దాదా సమాధికి గంధం ఎక్కించి రేయింబవళ్లు ఖవాలి గీతాలు ఆలపించారు. ఎలాంటి అల్లర్లు చోటుచేసుకోకుండా ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

శిలా ఫలకాన్ని తొలగించిన దుండగులు



శిలా ఫలకాన్ని తొలగించిన దృశ్యం

మహానంది: బుక్కాపురం రైస్ మిల్లు వద్ద శ్మశానానికి వెళ్లడానికి సౌకర్యంగా ఉండేందుకు ఆరు నెలల క్రితం రూ. 6లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. అందుకు ఏర్పాటు చేసిన శిలా ఫలకాన్ని గుర్తు తెలియని దుండగులు శనివారం రాత్రి తొలగించినట్లు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు కందుల రఘురామిరెడ్డి, కుంచపు శ్రీనివాసులు తెలిపారు. వారు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనుల్లో పోటీపడాలని, ఇలాంటి పనులకు పాల్పడటం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

కౌలు రైతుల సంతకాల సేకరణ



కౌలు రైతులతో సంతకాల సేకరణ చేపడుతున్న నాయకులు

ఆత్మకూరు: కౌలు రైతుల సమస్యలను సీఎం చంద్రబాబునాయుడికి తెలియజేసేందుకు కౌలు రైతులతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి.రమేష్‌కుమార్, జిల్లా కమిటీ అధ్యక్షుడు ఎస్.మార్కు, ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్ తెలిపారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని బస్టాండు సెంటర్ ఎదురుగా కౌలు రైతులతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని అతి పెద్ద చెరువు సిద్ధాపురం చెరువని, 24 వేల ఆయకట్టు భూములకు సాగునీరు అందించేందుకు పంట కాలువలు తీయాలని, రబీ సీజన్ కల్లా మండలంలోని అన్ని గ్రామాల చెరువులను సాగునీటితో నింపాలని కోరారు. చెరువుకు గండి పడిన ప్రదేశంలో నాణ్యమైన మట్టిని తోలి చెరువు లోతట్టు భాగంలో సిమెంట్ కాంక్రీట్‌తో నిర్మించాలన్నారు. అలాగే అలగనూరు రిజర్వాయర్‌కు గండిపడిన చోట మరమ్మతులు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి బ్యాంకు ద్వారా రుణాలను అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వి.యేసురత్నం, వీరన్న, ఎ.సురేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.స్వాములు, కౌలురైతు సంఘం జిల్లా నాయకులు నరసింహులు, ఏలియా తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ

పగిడ్యాల: పౌరసరఫరాల శాఖ ఆదేశాల మేరకు జూలై ఒకటో తేదీ నుంచి 17వ తేదీ వరకు తెల్లరేషన్ కార్డు వినియోగదారులకు ఎండీయూ వాహనాల ద్వారా నిత్యావసర సరుకులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని గోదాముల్లో లీగల్ మెట్రాలజీ, పౌరసరఫరాల శాఖ తనిఖీలు చేపట్టి కొత్త ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చిందన్నారు. జూలైలో బియ్యం, జొన్నలు మాత్రమే కార్డుదారులకు గుర్తించిన ఏరియాలలో ఎండీయూ డ్రైవర్లు ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు.


ముగిసిన బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): రెండు రోజులుగా జరుగుతున్న ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు ఆదివారం ముగిశాయి. స్థానిక నందిపైప్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవానికి స్వామి నేత్రాలయం వైద్యులు డాక్టర్ లక్ష్మయ్య, జనార్ధన్‌రెడ్డి, రామ్‌రాజ్, సూరజ్ పాల్గొన్నారు. ఏపీ బ్యాడ్మింటన్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంశీధర్ మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. అసోసియేషన్ సభ్యులు శేషిరెడ్డి, సంజీవరెడ్డి, కోచ్ నాగార్జున పాల్గొన్నారు.

ఎస్ఐ బాలచంద్రుడు సేవలు ఎనలేనివి



ఎస్ఐ బాలచంద్రుడుని సన్మానిస్తున్న సీఐ, ఎస్ఐలు

మహానంది: నిజాయితీ కలిగిన పోలీస్ అధికారులు పదవీ విరమణ పొందితే వారి స్థానాన్ని భర్తీ చేయడం ఎంతో కష్టమని రూరల్ సీఐ శివకుమార్ రెడ్డి తెలిపారు. మహానందిలో రెండేళ్లుగా ఏఎస్ఐగా పనిచేస్తూ ఎస్సైగా ఇటీవల పదోన్నతి పొంది పదవీ విరమణ చేసిన ఎస్ఐ బాలచంద్రుడు దంపతులను ఆదివారం రాత్రి ఘనంగా సన్మానించారు. ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్‌లో మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐ శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ పోలీసు శాఖకు బాలచంద్రుడు చేసిన సేవలు ఎనలేనివని, ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన ఘనత ఆయనకే సొంతమన్నారు. కార్యక్రమంలో గ్రామాల నాయకులు చింతం క్రాంతి కుమార్, ఉల్లి మధు, రెడ్ క్రాస్ ప్రతినిధి అమర్ నాథ్, గ్రామజ్యోతి యువజన సంఘం అధ్యక్షుడు దమాల చందు, మారెడ్డి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో జోరు వాన

మహానంది: మహానంది ఆలయ పరిసరాలతో పాటు సమీప గ్రామాల్లో ఆదివారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. ఇప్పటికే రైతులు పసుపు, అరటి వివిధ రకాల పంటల సాగులో భాగంగా విత్తనాలు వేశారు. గత కొద్ది రోజులుగా విరామం ప్రకటించిన వరుణుడు కరుణ చూపడంతో ఈ వర్షం రైతులకు ఎంతో లాభదాయకమని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యోగికి పదవీ విరమణ సర్వ సాధారణం



పదవీ విరమణ పొందిన డీఈ సాంబశివుడును సన్మానిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

ఆత్మకూరు: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సర్వ సాధారణమని ఆర్టీసీ డిపో మేనేజర్ మహేంద్రుడు అన్నారు. పట్టణంలోని ఏపీఎస్ఆర్టీసీ డిపోలో పలువురు ఆర్టీసీ ఉద్యోగులు ఆదివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డిపో మేనేజర్ మాట్లాడుతూ దాదాపు ఆర్టీసీ డిపోలో 30 నుంచి 40 సంవత్సరాలపాటు వివిధ వృత్తుల్లో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందిన డ్రైవర్లు, కండక్టర్‌లకు అభినందనలు తెలియజేశారు. ఆర్టీసీ సంస్థ అంటే తమదని భావించి సొంత వాహనంలా బస్సుల మరమ్మతులు, విధుల్లో అంకితభావంతో పనిచేశారన్నారు. మీ మన్ననలు, మీసేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం ఆర్టీసీలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన డ్రైవర్లు ఏ.ఎం.బాషా, టీఎండీ రఫిక్, షబ్బీర్, షఫీవుల్లా, సామన్న, శంకర్‌రెడ్డి, కండక్టర్లు మద్దిలేటి, రహమాన్, పుల్లయ్య, ఏడీసీలు రబ్బానీ, అప్పా, బి.వెంకటరాముడు, సుబ్బయ్య, ఇబ్రహీంలను శాలువాలు, పూలమాలలు వేసి సన్మానించారు. దాదాపు డిపోలో ఒకేరోజు 15 మంది సిబ్బంది పదవీ విరమణ చేయడం ఆత్మకూరు ఆర్టీసీ డిపో చరిత్రలో తొలిసారి. కార్యక్రమంలో ఆత్మకూరు డిపో కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ సహజం

పగిడ్యాల: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీవిరమణ సహజమే నని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. నందికొట్కూరు నీటి పారుదల శాఖ సెక్షన్‌లో డీఈగా సేవలందించిన సాంబశివుడు పదవీ విరమణ సందర్భంగా ఆదివారం మండలంలోని పడమర ప్రాతకోట గ్రామంలో చేపట్టిన సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయనను దుశ్శాలువా, పూల మాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామయ్య, పలుచాని మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దళితుడిననే పదం వాడి అభాసుపాలు కావొద్దు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి

నందికొట్కూరు: ఈ నెల 29వ తేదీన జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో దళిత ఎమ్మెల్యేను అవమానించడం తగదంటూ మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డిపై ఎమ్మెల్యే జయసూర్య చేసిన వ్యాఖ్యలను మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి ఆదివారం ఖండించారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే తీరుపై లబ్బి మండిపడ్డారు. భారత రాజ్యాంగ నిర్మాత కల్పించిన రిజర్వేషన్ వలన ఎమ్మెల్యేగా గెలుపొందిన మీరు విలువలను కాపాడుకోవాలని హితవు పలికారు. దళిత అనే పదం ఇష్టానుసారంగా, సందర్భంగా లేకుండా చీటికి మాటికి వాడటం ఎమ్మెల్యే విలువలు తగ్గించుకోవడమేనని చెప్పారు. మున్సిపల్ సాధారణ సమావేశంలో అజెండాలోని అంశాలను ఆమోదించేందుకు సర్వాధికారం చైర్మన్‌కు, కౌన్సిల్ సభ్యులకు మాత్రమే ఉంటుందని గుర్తు చేశారు. మున్సిపాలిటీ విధివిధానాల గురించి ఎమ్మెల్యే తెలుసుకోవాలని సూచించారు. గౌరవప్రదమైన హోదాలో ఎమ్మెల్యే హాజరై ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించి వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేయవచ్చన్నారు. సమావేశపు నిర్వహణ అజెండాలోని అంశాలను చేర్చడం, వాటిని ఆమోదం పొందే విధంగా చూడటంపై చైర్మన్‌కే సర్వాధికారాలు ఉంటాయని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోకిల రమణారెడ్డి, రమణ, విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం, బ్యాగులు, బూట్లు మంజూరు



మంజూరైన యూనిఫారం, బ్యాగులు, బూట్లు

జూపాడుబంగ్లా: 2024–25 విద్యాసంవత్సరానికి గాను మండలంలోని 38 పాఠశాలల్లోని 4,048 మంది విద్యార్థులకు యూనిఫాం, స్కూల్ బ్యాగులు, బూట్లు మంజూరైనట్లు ఎంఈఓ–1 చిన్నమద్దిలేటి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యూనిఫారం, స్కూల్ బ్యాగులు 4,048 మంది విద్యార్థులకు మంజూరు కాగా బూట్లు కేవలం 3,440, సాక్స్ 6,860 చొప్పున వచ్చాయన్నారు. 608 మంది విద్యార్థులకు బూట్లు, సాక్స్ తక్కువగా మంజూరైన విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి మిగిలిన విద్యార్థులకు మంజూరయ్యేలా చేస్తామన్నారు.



ఆకులల్లిన ఏనుగు!

మహానంది: ఆకులన్నీ కలిసి ఓ ఏనుగును తయారు చేశాయి. మనుషులు చెట్టును పెంచి ఆకులన్నీ కట్ చేశారా అన్నట్లు తీగలు అల్లుకుంటూ ఏనుగు రూపం తెచ్చాయి. ప్రకృతి అందంగా అల్లిన ఏనుగు ఆకారం మహానంది–నంద్యాల మార్గంలో చూపరులకు కనువిందు చేస్తోంది.

పింఛన్లు మంజూరు చేయాలి

నందికొట్కూరు: ఎన్నికల ముందు నుంచి దరఖాస్తు చేసుకున్న వారికి సామాజిక పింఛన్ మంజూరు చేయాలని సీపీఐ ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో గ్రామ, వార్డు సచివాలయాల్లో పింఛన్ల కొరకు దరఖాస్తులను పరిశీలించి అర్హతలున్నా ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో సీఎం చంద్రబాబు ఇచ్చిన 50 ఏళ్లు ఉన్న ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సామాజిక పింఛన్లు వెంటనే విడుదల చేయన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు సుధాకర్, సోమన్న, తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని వెంచర్



తరిగోపులలో 285 సర్వేనెంబర్‌లో వేసిన వెంచర్

జూపాడుబంగ్లా: గ్రామపంచాయతీ అనుమతుల్లేకుండా మండలంలోని తరిగోపుల గ్రామంలో వెంచర్ వేసి యథేచ్ఛగా ప్లాట్లు విక్రయిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారనే విమర్శలున్నాయి. గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 285లోని పొలంలో ప్లాట్లువేసి విక్రయిస్తున్నారు. పొలాన్ని ల్యాండ్ కన్వర్షన్ చేయించడంతో పాటు గ్రామపంచాయతీ అనుమతులు తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది. జీవో నెంబర్ 145 ప్రకారంగా వెంచర్‌లో 5శాతం స్థలాన్ని గ్రామపంచాయతీకి కేటాయించాలి లేని ఎండల అందుకు సమానమైన మొత్తాన్ని గ్రామపంచాయతీకి చెలానాగా చెల్లించాల్సి ఉంటుంది. అలాగే కుడా అధికారుల వద్ద లేఅవుట్ అప్రూవల్ తీసుకున్న తర్వాత వెంచర్ ఏర్పాటుచేసి ప్లాట్లను విక్రయించుకోవాల్సి ఉంటుంది. ఇవేవిలేకుండా యథేచ్ఛగా ప్లాట్లు విక్రయిస్తున్నా గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోకపోవటంతో పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శాంతయ్యను వివరణ కోరగా.. ఇప్పటిదాకా తమ వద్ద వెంచర్ ఓనరు ఎలాంటి అనుమతులు తీసుకోలేదన్నారు. తాము ఎవరికీ ఎలాంటి అనుతులు ఇవ్వలేదని తెలిపారు. వెంచర్ యజమానికి నోటీసులు జారీచేస్తామని, సరైన సమాధానం ఇవ్వకపోతే ప్లాట్లకోసం పాతినరాళ్లను తొలగిస్తామని వివరించారు.

సమసమాజ స్థాపనకు పని చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్

ఆత్మకూరు: భారతదేశంలో సమసమాజ స్థాపన కోసం ప్రతి కార్యకర్త కంకణబద్ధులై పని చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.నాగేశ్వరరావు, వి.యేసురత్నం కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని డాక్టర్ ఎ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ సభ్యుల రాజకీయ శిక్షణ తరగతులను సీనియర్ నాయకులు ఎం.రజాక్ అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో పాలకులు మారుతున్నారే తప్పా ప్రజల సమస్యలు మాత్రం తీరడం లేదన్నారు. పాకులు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టేలా, ప్రజలు సుఖంగా జీవించేలా ప్రతి కమ్యూనిస్టు కృషి చేయాలన్నారు. సమావేశంలో సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఎ.రణధీర, నాయకులు ఎస్.మంజుల, డి.రామ్‌నాయక్, సురేంద్ర, షేక్‌ఇస్మాయిల్, ఎస్.స్వాములు, జి.నాగేశ్వరరావు, దినేష్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.